జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి జోగులాంబ గద్వాల నారాయణపేట





ఆదివారం, మే 31, 2026 | పేజీలు :6


## మహిళల భాగస్వామ్యంతో మహిళా శక్తి సూపర్ మార్కెట్లు ఏర్పాటు

మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

6లో



# వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి

- ప్రతి గింజను కొనుగోలు చేస్తాం - దేశంలోనే ధాన్యం కొనుగోలులో తెలంగాణ నంబర్ వన్
- తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి గోదాములకు తరలింపు







**మహబూబ్‌నగర్, మే 30 ( ప్రజా జ్యోతి బ్యూరో )** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వారం రోజుల్లోగా జూన్ 4, 5 తేదీల నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు అంశంపై రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి అభివృద్ధి, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డితో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి జితేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, -మిగతా 2లో..

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

-అభివృద్ధి పనులలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

-వరి కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

-ఇందిరమ్మ ఇళ్లను గడువులోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి

-జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్




నాగర్ కర్నూల్ : మే 30(ప్రజా జ్యోతి) ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ప్రభుత్వ పథకాల అమలు,అభివృద్ధి కార్యక్రమాల

- మిగతా 2లో..

## బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చుదాం

నారాయణపేట జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక



2లో

# వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి




అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ శ్యాంప్రసాద్ లాల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల, వనపర్తి జిల్లాల కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, హేమంత్ కేశవ్ పాటిల్, సి.హెచ్. ప్రియాంక, ఆదర్శ్ సురభి, రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలపై మంత్రులకు వివరించారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ఉమ్మడి జిల్లాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని పేర్కొన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రం అత్యధిక వరి ధాన్యం పండించి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని తెలిపారు. వరి, మొక్కజొన్న ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. రైతులు నష్టపోకుండా తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. వాతావరణ శాఖ జూన్ 4 తర్వాత వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో జూన్ 4, 5 తేదీల్లోగా కొనుగోళ్లు పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు.కొనుగోలు, రవాణా, నిల్వ, రైతులకు చెల్లింపుల ప్రక్రియను సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇసుక రవాణాకు వినియోగిస్తున్న లారీలను తాత్కాలికంగా ధాన్యం రవాణాకు మళ్లించాలని సూచించారు. అవసరమైతే లారీలు, డీసీఎంలను రిక్విజిషన్ చేసి ధాన్యం తరలింపునకు వినియోగించాలని ఎస్పీలు, ఆర్టీఏ అధికారులకు సూచించారు.హమాలీల కొరత ఉన్న ప్రాంతాల్లో పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల నుంచి అదనపు హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ యాసంగిలో 66 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 51 లక్షల మెట్రిక్ టన్నులకు మాత్రమే ఎంఎస్పీ వర్తింపజేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 75 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గకుండా ఎంత ధాన్యం వచ్చినా కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.16,479 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు.రాష్ట్రంలో 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, 13 వేల వాహనాలు, రెండు లక్షల మంది సిబ్బంది, 2,008 రైస్ మిల్లులు భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. 20 కోట్ల 80 లక్షల గన్నీ సంచులు సరఫరా చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు.ఈ యాసంగికి సుమారు రూ.11,150 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. 8 లక్షల 75 వేల మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. 8,575 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే 2,255 కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వంలో ధాన్యం చెల్లింపులు నెలల తరబడి ఆలస్యం అయ్యేవని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 48 నుంచి 72 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోందన్నారు. 2024-25 ఖరీఫ్, రబీ సీజన్‌లకు కలిపి రూ.36,148 కోట్లు, 2025-26 ఖరీఫ్, రబీ సీజన్‌లకు కలిపి రూ.39,359 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, రైతులకు ఇబ్బంది కలిగించేలా తాలు, తరుగు పేరుతో కోతలు విధించే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో ధాన్యం సేకరణపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. గోదాముల కొరత ఉన్న ప్రాంతాల్లో ప్రైవేట్ గోదాములు, ఫంక్షన్ హాళ్లను వినియోగించాలని సూచించినట్లు చెప్పారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక అధికారిని నియమించి పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. టార్పాలిన్లు అధికంగా అందుబాటులో ఉంచాలని సూచించారు.

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయంతో పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తోందన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే ప్రయత్నాలను అందరూ కలిసికట్టుగా తిప్పికొట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టులు రాజకీయ పలుకుబడి ఉన్న వారికి కాకుండా నిజంగా లారీలు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం సేకరణలో కలెక్టర్లు, అధికారులు సమర్థంగా పనిచేస్తున్నారని అభినందించారు.ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి, కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సేకరణను దిగ్విజయంగా పూర్తి చేసిందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వనపర్తి మినహా మిగతా జిల్లాల్లో రెండు, మూడు రోజుల్లో కొనుగోళ్లు పూర్తవుతాయని తెలిపారు.

ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉంటూ అధికారులను అప్రమత్తం చేయడం వల్లే ధాన్యం కొనుగోలు సజావుగా సాగిందన్నారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరగడంతో వారు సంతోషంగా ఉన్నారని తెలిపారు.ఈ సందర్భంగా మహిళా సంఘాలకు కమిషన్‌గా రూ.5 కోట్ల 34 లక్షల చెక్కును మంత్రులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పురోగతిపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు.శనివారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఉప్పునుంతల మండల పరిధిలోనిమామిళ్ళపల్లి,లక్ష్మాపూర్ గ్రామాల సందర్శనలో కలెక్టర్ వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు.ముందుగా మామిళ్ళపల్లి గ్రామం లోని చెరువు కట్టపై కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి,పనుల నాణ్యత,కార్మికుల హాజరు,వేతనాల చెల్లింపులపై అధికారులను అడిగి తెలుసుకుని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాల పురోగతి,ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు.ఇదిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గడువులో పూర్తి చేసేలా అర్హులైన కుటుంబాలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇళ్ల నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని అన్నారు.అనంతరం గ్రామంలో కొనసాగుతున్న జనాభా గణన ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ కుటుంబాల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని,ప్రభుత్వ ప్రణాళికల రూపకల్పనలో జనాభా గణాంకాలు ఎంతో కీలకమని జూన్ 1వ,తేది వరకు జిల్లాలో మొదటివిడత జనగణన ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు.అనంతరం మామిళ్ళపల్లి,లక్ష్మాపూర్ గ్రామాలలోని కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు ప్రక్రియ,తూకం,చెల్లింపుల విధానంపై వివరాలు తెలుసుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకొని ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా,వేగవంతంగా నిర్వహించడంతో పాటు రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని,వరి కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు,నిల్వ ఏర్పాట్లు,రికార్డులన పరిశీలించి రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమనిరైతులు పంటకు గిట్టుబాటుధర పొందేలా అన్ని చర్యలు చేపట్టాలని కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ఎంపిక చేసిన మిల్లులకు తరలించేందుకు వాహనాలను అందుబాటులోఉంచాలని అన్నారు.

అనంతరం మామిళ్ళపల్లి గ్రామంలోని పురాతన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని సందర్శించిన కలెక్టర్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి ఆలయ విశిష్టత,చారిత్రక ప్రాధాన్యతను ఆలయ అర్చకులను అడిగి తెలుసుకుని ఆలయ అభివృద్ధి,భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన ఇతర అంశాలపై ఆరా తీశారు.కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు,మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు,సర్పంచ్‌లు,రైతులు గ్రామస్థులు పాల్గొన్నారు.



# బాల్య వివాహా రహిత జిల్లాగా మార్చుదాం

నారాయణపేట ప్రతినిధి మే 30 ప్రజా జ్యోతి

నారాయణ పేట ను బాల్య వివాహా రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక తెలిపారు. బాలికల చదువుతోనే బాల్య వివాహాలను నిర్మూలించడం సాధ్యం అవుతుందన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా శనివారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వయోజన విద్య అమ్మకు అక్షర మాల, స్నేహ సంఘాల ద్వారా మాక్ పార్ల మెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తో కలిసి కలెక్టర్ హజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాలికలు ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సారి పది ఫలితాలలో జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు అమ్మాయిలే కావడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఎప్పుడూ పది ఫలితాల్లో బాలికలదే హావా అని చూస్తుంటాం కానీ ఉద్యోగాలలో మాత్రం బాలికలు వెనకబడిపోతారని, పదో తరగతి తర్వాత ఆరేళ్ల లో బాలికలు తీసుకునే నిర్ణయాలతో భవిష్యత్తును మార్చుకోవద్దని తెలిపారు. రేపు జరగబోయే దాని గురించి ఈ రోజు ఆలోచించ వద్దన్నారు. అమ్మకు అక్షర మాల ద్వారా వయోజనులకు చదువు చెప్పే వీ వో లకు ఈ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో మహిళా అక్షరాస్యత పెరగాలని ఆమె సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ.. జిల్లా లో బాల్య వివాహాల నిర్మూలన కు మిషన్ మోడ్ లో పనిచేయాలన్నారు. ప్రభుత్వ శాఖల నుంచి సహకారం ఉంటుందని చెప్పారు. బాలికలు తమ కోసం తాము ఫైట్ చేయాలని, తమ తోటి స్నేహితురాలి కోసం కూడా ఫైట్ చేయాలన్నారు. మహిళలు చదువుకుంటే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. కాగా అంతకు ముందు బాల్య వివాహాల నిరోధక చట్టం పై మాక్ పార్ల మెంట్ నిర్వహించిన కిశోర బాలికలను జిల్లా కలెక్టర్,ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విధుల నిర్వహణ లో ఉత్తమ ప్రతిభ చాటిన సి సి లు, సిబ్బందికి కలెక్టర్, ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ వెంకట్ రాములు, జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయ చంద్రమోహన్, డీ ఈ ఓ గోవింద రాజులు, డీ పీఎం, ఏ పీ ఎం లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాఠశాల నిర్మాణాలు పూర్తి చేయాలి

**-విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత**
**-గ్రామీణ విద్యార్థులకు ఆధునిక విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యం**





నాగర్ కర్నూల్ : మే 30(ప్రజా జ్యోతి)

పాఠశాలల పునఃప్రారంభం నాటికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనాల నిర్మాణ పనులను పూర్తిచేసి విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.శనివారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలంలోని పోల్కంపల్లి,వంగూరు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న పబ్లిక్ స్కూల్ భవనాలను పరిశీలించి,పాఠశాల భవన నిర్మాణం,తరగతి గదులు,లైబ్రరీ,ఆటస్థలం, తాగునీటి సదుపాయాలు,పారిశుద్ధ్యం,మౌలిక వసతులు మౌలిక సదుపాయాల ఏర్పాట్లనుపరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.నిర్మాణ పనుల పురోగతిని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకుని పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిర్మిస్తున్న ఈ విద్యాసంస్థల్లో ప్రతి నిర్మాణం నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని,నిర్మాణ నాణ్యత,భవనాలభద్రతా ప్రమాణాలు,విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా తరగతి గదుల రూపకల్పన వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ పాఠశాలలలోచదివే విద్యార్థులకు ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా అన్ని వసతులు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ పాఠశాలలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తుందని గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా అత్యాధునిక విద్యా వాతావరణంలో విద్యను అభ్యసించే అవకాశం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందన్నారు.పాఠశాలల పునఃప్రారంభ సమయానికి నిర్మాణ పనులు పూర్తికాకపోతే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని మిగిలిన పనులను వేగవంతంగా చేసి గడువులోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.పాఠశాల ప్రారంభం నాటికి అన్ని తరగతి గదులు,లైబ్రరీ,ఆటస్థలాలు,తాగునీరు, పారిశుద్ధ్య వసతులు పూర్తిగా అందుబాటులో ఉండేలా చూడాలని నిర్మాణ పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని,అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని,విద్యార్థులకు సురక్షితమైన,పరిశుభ్రమైన,సౌకర్యవంతమైన విద్యా వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.అనంతరం నిర్మాణ ప్రదేశంలో పనిచేస్తున్న అధికారులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి పాఠశాలలను విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రమేష్ కుమార్,కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు,ఇంజినీర్లు,ప్రజా ప్రతినిధులు,కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# తల్లి-శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

**-పోషకాహారలోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**
**-తల్లి-శిశు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి**
**-గర్భిణీలు,బాలింతలకు మెరుగైన సేవలు అందించాలి**
**-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ : మే 30(ప్రజా జ్యోతి)**

తల్లి,శిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు.వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన “అమ్మ మాట--అంగన్వాడి బాట” కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్శనివారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రంలో గర్భిణీలు,బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలు,పోషకాహార పంపిణీ,ఆరోగ్య పరిరక్షణ చర్యలు,నమోదు వివరాలు తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి అంగన్వాడీ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీలు,బాలింతలు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని “అమ్మ మాట--అంగన్వాడి బాట” కార్యక్రమం ద్వారా గర్భిణీలు,బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ వారికి అవసరమైన పోషకాహారం, వైద్య సేవలు అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా సిబ్బంది కృషిచేయాలన్నారు.చిన్నారుల బరువు,ఎదుగుదల వివరాలను తప్పనిసరిగా నమోదుచేసి ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి అవసరమైన అదనపు పోషకాహారం అందించి వారి ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గర్భిణీలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రులలోనే ఆరోగ్య పరీక్షలు చేయించుకొని వైద్యుల సూచనలు పాటించాలని బాలింతలు,గర్భిణీలు పోషకాహారంపై అవగాహన పెంపొందించుకుని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం రికార్డులు,హాజరు పట్టికలు,గుడ్లు,పోషక ఆహార నిల్వలు,పంపిణీ విధానాలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలుచేస్తూ కేంద్రానికి వచ్చిన గర్భిణీలు,బాలింతలతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకుని సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో తల్లి, శిశు ఆరోగ్యంపై మరింత అవగాహన కల్పిస్తూ ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో,మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు,వైద్య సిబ్బంది.×జణూ అధికారులు,అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా వర్కర్లుప్రజాప్రతినిధులు,గ్రామస్తులు పాల్గొన్నారు.



## “అమ్మ మాట -- అంగన్‌వాడీ బాట”



**నారాయణపేట ప్రతినిధి మే 30 ప్రజా జ్యోతి**

ఈ కార్యక్రమంలో భాగంగానమోదైన చిన్నారులకు నూతన దుస్తులను పంపిణీ చేయడం జరిగింది. అలాగే మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల ప్రీ-స్కూల్ విభాగంలో కొత్తగా నమోదు (ఎన్‌రోల్‌మెంట్) చేయడం జరిగింది అలాగే పిల్లలకు విద్యారంభ సర్టిఫికెట్లను పంపిణీ చేయడం జరిగిందిఅదేవిధంగా, జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రపరచి, కేంద్రాల పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా గౌరవ జిల్లా కలెక్టర్ గారు, మార్కెట్ కమిటీ చైర్మన్ గారు, గౌరవ సర్పంచ్ గారు మరికల్ మండలం అప్పంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు నూతన దుస్తులు, పలకలు పంపిణీ చేశారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీ రాజేందర్ గౌడ్, ఏసీడీపీఓ శ్రీమతి వెంకటమ్మ, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్ లు , గౌరవ సర్పంచ్ గారు, ఉప సర్పంచ్ గారు, వార్డు సభ్యులు,తహసీల్దార్ శ్రీ రాంకోటి గారు, ఎంఈఓ మరికల్, గ్రామ పెద్దలు, మార్కెట్ కమిటీ చైర్మన్ గారు తదితరులు పాల్గొన్నారు

## దేశానికి వెన్నెముక రైతన్న అన్నం పెట్టే రైతన్నను అరిగోసలు పెట్టొద్దు.....

### రైతు దుఃఖిస్తే రాజకీయ నాయకునికి రాజకీయ నాశనానికి రైతు పెట్టే శాపనార్థాలు......

**కొల్లాపూర్ మే 30 ప్రజా జ్యోతి**

రాష్ట్రానికి అన్నం పెట్టే అన్నదాత ఆర్థికంగా బలపడితేనే గ్రామశీ అభివృద్ధి ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది.కొల్లాపూర్ నియోజక వర్గం పట్టణ పరిధి లో ఉన్న నాలుగు మండలాల మార్కెట్ యార్డులో తడిచి ధాన్యాన్ని ప్రజా పాలన ప్రభుత్వము తక్షణమే కొనుగోలు చేయాలని అదేవిధంగా రైతులకు డబ్బులు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి భారతీయ జనతా పార్టీ సింగోటం గ్రామ డిప్యూటీ సర్పంచ్ తమటం సాయి కృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. దేశానికి వెన్నెముక రైతన్న అన్నం పెట్టే రైతన్నను హరిగోశలు పెట్టొద్దని రైతు దుఃఖిస్తే రాజకీయ నాయకునికి రాజకీయ సన్యాసానికి నాశనానికి రైతు పెట్టె శాపనార్థాలు. ఈరోజు మనము మూడు పూటలు అన్నం తింటున్నాము అంటే అది రైతన్న పండించే పంట వలన మూడు పూటలు ముద్దలు నోట్లోకి వెళ్ళుతున్నావి అంటే వాటికి కారణం రైతన్న. అలాంటి

రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదే.కొనుగోలు కేంద్రాల్లో అవ్యవస్థకు రైతులు బాధ్యులు కాదు

అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు కొనుగోలు ఆలస్యం కావడంతో ధాన్యం తడిసి మొలకెత్తుతోంది.రైతుకు వెంటనే చెల్లింపులు చేయాలి పంట అమ్మిన తర్వాత డబ్బులు ఆలస్యం కావడం వల్ల రైతు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు చెల్లింపులు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలి.దళారుల దోపిడీని అరికట్టాలి కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో రైతులు తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తోంది

రైతు కష్టానికి గౌరవం ఇవ్వాలి.రాజకీయాలు కాదు పరిష్కారాలు కావాలి.

తమటం సాయి కృష్ణ గౌడ్సింగోటం గ్రామ ఉపసర్పంచ్.బిజెపి పార్టీ జిల్లా నాయకులు వారితో పాటు భారతీయ జనతా పార్టీ నాయకులు, చంద్రశేఖర్ రావు రమేష్ కురుమూర్తి నాయక్ సోమ భాస్కర్ గౌడ్ సాయిరాం ఉన్నారు.



# ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**-శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి**

**-అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుంది**

**-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**




నాగర్ కర్నూల్ : మే 30(ప్రజా జ్యోతి)

ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు.శనివారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి జూన్ నెలాఖరులోపు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని గ్రామంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల స్థితిగతులను శాఖల వారిగా సమీక్షించి,ప్రభుత్వ పాఠశాల భవనాల నిర్మాణం,అంగన్‌వాడీ భవనాలు,ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులు,డ్రైనేజీ నిర్మాణాలు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం,తాగునీటి సౌకర్యాల కల్పన, విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి తదితర కార్యక్రమాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని,కొండారెడ్డిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని ఈ నేపథ్యంలో గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎటువంటి జాప్యం చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు.పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని నిర్మాణ పనులు నిర్దేశిత ప్రమాణాలకనుగుణంగా ఉండేలా పర్యవేక్షించాలని,నాసిరకం పనులకు తావివ్వవద్దన్నారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని అభివృద్ధి పనులకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని,శాఖల మధ్య సమన్వయం లోపించకుండా చర్యలు తీసుకోవాలని,పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని,గడువులోపు పూర్తి కాని పనులపై సంబంధిత అధికారుల బాధ్యతను నిర్ధారిస్తామని,గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని,కొండారెడ్డి పల్లి గ్రామాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు,నరసింహారెడ్డి, అదనపు కలెక్టర్ దేవ సహాయం,కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి,పిడి రాజేశ్వరి,జిల్లా,నియోజకవర్గ, మండల స్థాయి శాఖల అధికారులు,ఇంజినీరింగ్ విభాగాల ప్రతినిధులు,స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# యువత పొగాకు అలవాట్లకు దూరంగా ఉండాలి

## - ప్రపంచ పొగాకు నిషేధ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

**వనపర్తి, మే 31 (ప్రజాజ్యోతి):**

ప్రపంచ పొగాకు నిషేధ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా న్యాయ సేవా సాధికారిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా బాయ్స్ స్కూల్ గ్రౌండ్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డా. రామచంద్రరావు, జిల్లా న్యాయ సేవా సాధికారిక సంస్థ జడ్జి కళార్చన, వనపర్తి టౌన్ ఎస్ఐ హరి ప్రసాద్ పాల్గొని పొగాకు వినియోగం వల్ల కలిగే నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు తదితర అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాటలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా పొగాకు నివారణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ప్రతి సంవత్సరం పొగాకు వినియోగం కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ముఖ్యంగా యువత పొగాకు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని, మానసిక ఒత్తిడి లేదా ఆందోళన వంటి సమస్యలు ఎదురైనప్పుడు టెలి-మనస్ టోల్ ఫ్రీ నంబర్ 14416 ద్వారా నిపుణుల సలహాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. రియా శ్రీ, శ్రీనివాస్ కొండ, మధు మోహన్ గౌడ్, ఎన్సీడీ బృంద సభ్యులు, తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.




# ప్రజా సేవలే మున్సిపాలిటీ లక్ష్యం:మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ

**వడ్డేపల్లి మే 30(ప్రజా జ్యోతి):**

వడ్డేపల్లి మున్సిపాలిటీ కేంద్రంలో అందిన పింఛన్ దరఖాస్తులను మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ పరిశీలించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.అనంతరం వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 4వ,వార్డు ఇందిరానగర్ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన చైర్మన్ మంజుల ధర్మ,చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్యం, పోషకాహారం,విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు.పిల్లల భవిష్యత్తు బలోపేతానికి అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.కేంద్రంలో అందుతున్న సేవలు,సౌకర్యాల గురించి అడిగి తెలుసుకుని,ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు చిన్నారులకు సక్రమంగా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది చైర్మన్ మంజుల ధర్మను ఘనంగా సన్మానించారు.ప్రజలకు అవసరమైన సేవలు,సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా కృషి చేయడమే మున్సిపాలిటీ లక్ష్యమని చైర్మన్ మంజుల ధర్మ తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఆమె పేర్కొన్నారు.





# జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన కిశోర బాలికలు



**నాగర్ కర్నూల్ : మే 30 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ చౌరస్తాలోని ఎస్పీ కార్యాలయాన్ని శనివారం దాదాపుగా 150 మంది కిశోర బాలికలు జిల్లా కార్యాలయంలో ఏ విధంగా పనులు నిర్వహిస్తారని అరా తీశారు.అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సిసిఎస్ సిఐ శంకర్ ఎస్పీ కార్యాలయంలో జరిగే పనుల గురించి వారికి వివరించారు.అదేవిదంగా షీ-టీం ఇన్చార్జి విజయలక్ష్మి షీ-టీం పనుల గురించి క్లుప్తంగా వివరించి మీకు ఎలాంటి ఇబ్బంది ఉన్న మాకు తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కిషోర్ బాలికల ఉపాధ్యాయ బృందంతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన తహసీల్దార్ కార్యాలయాలకు నిధులు మంజూరు

**-ఎమ్మెల్యే డా.కూచకుళ్ల రాజేష్ రెడ్డి**



**నాగర్ కర్నూల్ : మే 30 (ప్రజా జ్యోతి)**

నాగర్‌కర్నూల్,తాడూరు,తెల్కపల్లి మండలాల తహసిల్దార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం మొత్తం 7.63 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ నేడు జీవోలు జారీ చేసిందని ఎమ్మెల్యే డాక్టర్.కూచకుళ్ళ రాజేష్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతతహసిల్దార్ కార్యాలయ భవనాలు శిధిలావస్థకు చేరడంతో అటు సిబ్బందికి,ఇటు పనుల కోసం వచ్చే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమస్యను గుర్తించిన నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచకుళ్ల రాజేష్ రెడ్డి నూతన భవనాల నిర్మాణం కోసం నిధులను మంజూరు చేయాలని ముఖ్య మంత్రికి వినతిపత్రం సమర్పించడంతో ఎమ్మెల్యే విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం శనివారం నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు ఉత్తర్వుల (+.వాం) విడుదల చేసింది.నియోజకవర్గ ప్రజల,సిబ్బంది ఇబ్బందులను అర్థం చేసుకుని,నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి,రెవెన్యూ శాఖ మంత్రికి ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# దళితుల హక్కుల పరిరక్షణకు భారీ ర్యాలీకి పిలుపు

కే టి దొడ్డి మే 30(ప్రజా జ్యోతి):

దళితుల హక్కులు,మత స్వేచ్ఛ పరిరక్షణ కోసం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారీ ర్యాలీకి దళిత,క్రైస్తవ,ఉద్యోగ,ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.దళితులకు పూర్తి స్థాయిలో మత స్వేచ్ఛ కల్పించాలని, 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.అలాగే బీసీ వర్గంలో ఉన్న కురువలను ఎస్సీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో ప్రతి గ్రామం నుంచి వందలాదిగా ప్రజలు తరలివచ్చి,జిల్లా కేంద్రంలో నిర్వహించే ర్యాలీలో వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ప్రతి సంఘం తమ తరఫున వాహనాల ఏర్పాట్లు చేసుకుని కార్యకర్తలు,ప్రజలను ర్యాలీకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘాలు,క్రైస్తవ సంఘాలు,ఉద్యోగ సంఘాలు,ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని ర్యాలీ విజయవంతానికి సహకరించాలని కేటిదొడ్డి మండల ఇంచార్జి గువ్వలదిన్నె జాంబయ్య మాదిగ విజ్ఞప్తి చేశారు.

# ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## – బీజేపీ నాయకులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి, పెద్దిరాజు



**వనపర్తి, మే 30 (ప్రజాజ్యోతి):**
రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థంగా నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి విమర్శించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు తో కలిసి ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులు, రవాణా ఖర్చులు తదితరాలను కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం నోడల్ ఏజెన్సీగా తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేకపోయిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు, తూకం సదుపాయాలు, రవాణా ఏర్పాట్లు లేక రైతులు నెలల తరబడి ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అనుభవం లేని అధికార పార్టీ నాయకులకు టెండర్లు ఇవ్వడం వల్ల ధాన్యం రవాణాలో తీవ్ర జాప్యం జరిగిందని, ఈ క్రమంలో అకాల వర్షాలతో రైతుల ధాన్యం తడిసి నష్టపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం ధాన్యం కొనుగోలు పూర్తయిందని చెబుతుండటం వాస్తవాలకు విరుద్ధమని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'రైతు గోస--బీజేపీ భరోసా' కార్యక్రమం ద్వారా రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన ధాన్యం సేకరణ చేపట్టాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# ఎవరీ కులం ఎంతో వారికీ అంతా వాటా కావాలి

### జూన్ 14 మహబూబ్‌నగర్ భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలి

### బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి గుడిసె బాలయ్య ముదిరాజ్ పిలుపు




**దేవరకద్ర, మే 30 ( ప్రజా జ్యోతి ) :**
"ఎవరీ కులం ఎంతో వారికీ అంతా వాటా" అనే నినాదంతో జూన్ 14న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు దేవరకద్ర నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి గుడిసె బాలయ్య ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం దేవరకద్ర కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కులానికి వారి జనాభా ప్రాతిపదికన రాజకీయ, సామాజిక వాటా దక్కాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, రాజ్యాధికార సాధన కోసం 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఏకమై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రెండు, మూడు కులాల నాయకత్వమే అధికారాన్ని కైవసం చేసుకుని బీసీ, ఎస్సీ, ఎస్టీలను అణగదొక్కుతోందని ఆరోపించారు. రాజ్యాంగబద్ధ హక్కులను కూడా కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అణగారిన వర్గాలకు సరైన సామాజిక న్యాయం అందలేదని విమర్శించారు. బీసీలకు రాజకీయ వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జూన్ 14న నిర్వహించే బహిరంగ సభకు జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు, కుల సంఘాల నాయకులు, మేధావులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె. శ్రీనివాసులు ముదిరాజ్, టి. సత్యనారాయణ, గణేష్ ముదిరాజ్, వి. హన్మంత్, ఎస్. సత్యనారాయణ, రాము, జగన్, రిటైర్డ్ ఏఎస్ఐ వెంకటయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# నూతన విద్యార్థులకు కొప్పునూర్ హాస్టల్ ఆహ్వానం

### ఇంటింటా ప్రచారం.. హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం: ఇన్‌చార్జి సంక్షేమ అధికారి రవీందర్‌రెడ్డి



**చిన్నంబావి, మే 30 (ప్రజాజ్యోతి)**
మండలంలోని కొప్పునూర్ ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహంలో నూతన విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి సంక్షేమ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. జూన్ 12న హాస్టల్ పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఆసక్తి గల విద్యార్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీలు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు హాస్టల్‌లో ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి టీసీ తీసుకుని కొప్పునూర్ పాఠశాలలో చేరిన అనంతరం ఒరిజినల్ బోనాఫైడ్ సర్టిఫికెట్‌ను హాస్టల్‌లో సమర్పించాలన్నారు. కొప్పునూర్ గ్రామానికి 5 కిలోమీటర్లకు పైగా దూరంలో నివసించే విద్యార్థులు మాత్రమే ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. హాస్టల్‌లో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, వసతి, సాయంత్రం స్నాక్స్, కాస్మెటిక్ చార్జీలు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక ట్యూషన్లు నిర్వహిస్తున్నామన్నారు. గత విద్యా సంవత్సరంలో ఎస్ఎస్సీ ఫలితాల్లో హాస్టల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని, జడ్పీహెచ్ఎస్ కొప్పునూర్‌లో స్కూల్ టాపర్ కూడా హాస్టల్ విద్యార్థే కావడం విశేషమన్నారు. నూతన ప్రవేశాల కోసం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.



# విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

- ప్రైవేటు పాఠశాలల్లో 25% ఉచిత సీట్లు కల్పించాలి
- అధిక ఫీజులు వసూలు చేసే సంస్థలపై చర్యలు తీసుకోవాలి
- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



**వనపర్తి, మే 30 (ప్రజాజ్యోతి):**
విద్యాహక్కు (ఆర్‌టీఈ) చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి, ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై భారం మోపుతున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరారు. పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్‌లు, షూలు, ఇతర వస్తువులను బలవంతంగా విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న సంస్థలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని హెచ్చరించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై ఆర్టీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గతంలో జరిగిన ప్రమాదాలను గుర్తు చేస్తూ విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కార్పొరేట్ విద్య మోజులో పడి అధిక మొత్తాలు ఖర్చు చేయకుండా ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రోత్సహించాలని కోరారు. ఆర్‌టీఈ చట్టాన్ని అమలు చేయని ప్రైవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకునే వరకు బీసీ పొలిటికల్ జేఏసీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వీవీ గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, కృష్ణప్రసాద్, అస్కని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు డిస్కమ్ రైతాంగానికి శాపం

### తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచే కుట్ర జరుగుతోంది : మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్



**మహబూబ్‌నగర్, మే 30 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**
రైతు డిస్కమ్ పేరుతో తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచే కుట్ర జరుగుతోందని తెలంగాణ రక్షణ సేన మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్ తీవ్రంగా విమర్శించారు. రైతులు అడగకుండానే ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ నిర్ణయం వ్యవసాయానికి ఎండ్రిన్ పోసినట్టేనని అన్నారు. రైతులకు మేలు చేసే నిర్ణయమైతే ప్రభుత్వం ఆరు నెలలుగా ఎందుకు గోప్యంగా ఉంచిందని ప్రశ్నించారు. డిస్కమ్‌లకు రూ.69 వేల కోట్ల బకాయిల్లో రూ.54 వేల కోట్లు ప్రభుత్వమే చెల్లించాల్సి ఉందని, ముందుగా ఆ బకాయిలు చెల్లించి ప్రస్తుతం ఉన్న డిస్కమ్‌లను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కొత్త రైతు డిస్కమ్ వల్ల రైతులకు ప్రయోజనం కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయని, సిబ్బంది కొరత కారణంగా విద్యుత్ సేవలు మరింత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణలోని 29 లక్షల వ్యవసాయ బోర్ల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై హైదరాబాద్‌లో మాత్రమే కాకుండా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్‌లు నిర్వహించాలని ఈఆర్సీని కోరారు. రైతుల భవిష్యత్తును ప్రభావితం చేసే ఈ ప్రతిపాదనను ఈఆర్సీ తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రైతు డిస్కమ్‌లో తెలంగాణ ఉద్యోగులకు ప్రాధాన్యం కల్పించాలని, విద్యుత్ రంగంలో తెలంగాణ ఉద్యోగుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.

# మహిళల భాగస్వామ్యంతో మహిళా శక్తి సూపర్ మార్కెట్లు ఏర్పాటు

మహబూబ్‌నగర్, మే 30 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పడేలా ప్రతి నియోజకవర్గంలో మహిళా శక్తి సూపర్ మార్కెట్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ నగరంలోని బృందావన్ క్లాసిక్ గార్డెన్‌లో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను విజయవంతమైన వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో "మహిళా శక్తి సూపర్ మార్కెట్లు" ఏర్పాటు చేసి మహిళా సంఘాల సభ్యులను భాగస్వాములుగా, షేర్ హోల్డర్లుగా చేసే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సూపర్ మార్కెట్లను మహిళలే నిర్వహిస్తూ, వారి అవసరాలకు అనుగుణంగా సేవలు అందించనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మహిళలకు ఉపాధి అవకాశాలు, ఆర్థిక భద్రత, గౌరవం కలుగుతాయని వివరించారు. మహిళలను భాగస్వాములుగా చేస్తే ఈ వ్యవస్థ భవిష్యత్తులో పెద్ద కార్పొరేట్ సంస్థగా ఎదగగలదని తాను సూచించగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి వెంటనే విధివిధానాల రూపకల్పనకు అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. రాబోయే రోజుల్లో ప్రతి జిల్లా, నియోజకవర్గంలో మహిళా శక్తి సూపర్ బజార్లు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తక్కువ లీజుతో ప్రభుత్వ స్థలాలు కేటాయించడం, రిటైల్ రంగంలో శిక్షణ అందించడం ద్వారా మహిళలను వ్యాపార రంగంలో ప్రోత్సహించనున్నట్లు చెప్పారు.

భవిష్యత్తులో రైస్ మిల్లులు, ఇతర పారిశ్రామిక యూనిట్ల నిర్వహణలో కూడా మహిళలకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కృతజ్ఞత సభలో వేలాది మహిళలు పాల్గొని ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత , డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ ద్వితీయ మహాసభలు విజయవంతం

**నారాయణపేట ప్రతినిధి మే 30 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ద్వితీయ మహాసభలను శనివారం సిపిఐ పార్టీ ఆఫీసులో నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటియుసి నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షులు పి .వెంకటేష్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నారాయణపేట జిల్లాలో 1250 మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారని ఆయన వివరించారు. ఇట్టి మహాసభలో అల్పాహారం పాత బిల్లుల విషయంలో అలాగే కార్యక్రమాన్ని ప్రారంభిస్తే నేటి వరకు అట్టి బిల్లులు రాలేదని ఆయన విమర్శించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం కార్మికులకు పెండింగ్ లో ఉన్న బిల్లులను తక్షణమే వచ్చేందుకు పల ఆందోళన కార్యక్రమాలు చేసేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లాలో పలు మండలాల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు రక్షణ లేక కార్మికులు పట్టించుకునే నాధుడే లేడని ఆయన విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వంట కార్మికులకు పదివేల రూపాయలు ఇస్తామన్న హామీ నేటికి అమలు చేయలేదన్నారు. కోడిగుడ్లను నిత్యవసర వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లులు వస్తాయని చెప్పిన సక్రమంగా అమలు కావడం లేదన్నారు. వంట కార్మికులకు లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని




ఉపసంహరణ చేసుకోవాలన్నారు. గతంలో అల్పాహారం చేసిన బిల్లులు పారితోషక బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. వంట కార్మికులకు ప్రమాద బీమా పథకం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని వంట కార్మికులను తీసివేసిన వారిని ప్రత్యేకమైన ఉపాధి కల్పించాలన్నారు ప్రతి విద్యార్థికి మెచ్చర్జీలు 25 రూపాయలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. జూన్ 6న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ మధ్యాహ్న భోజన మహాసభను ప్రతి ఒక్కరు కార్మికులు హాజరై తమ హక్కుల కోసం పోరాటం చేసి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అదే అదే విధంగా నూతన కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణపేట మధ్యాహ్న భోజన కార్మికురాలు గా పూజారే రెకమ్మ, అధ్యక్షులుగా (ధన్వాడ), కార్యదర్శిగా చిన్నమ్మ ఊట్కూరు. ఉపాధ్యక్షురాలుగా యాదమ్మ, (మరికల్ మండలం), సహకార దర్శిగా సాయమ్మ కోశాధికారిగా పద్మమ్మ కమిటీ సభ్యులుగా సునీత వసంతమ్మ అనంతమ్మ జయమ్మ , మొనమ్మ ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రభుత్వంలో ఆసరా పింఛన్లు మీకోసం...

కొల్లాపూర్ మే 30 ప్రజా జ్యోతి

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గం నాలుగు మండలాల్లో ఉన్న.వృద్ధులు.వితౌంతులు.వికలాంగులు కల్లుగీతా కార్మికులు బీడీ కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త పెన్షన్లు అప్లై చేసుకునే దరఖాస్తు వివరాలు,కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్ పథకం ద్వారా ఆర్థిక సాయం పొందేందుకు అర్హతలు మరియు అవసరమైన పత్రాలు.

1.వృద్ధాప్య పెన్షన్...

తెలంగాణ రాష్ట్ర నివాసి అయి ఉండాలి.కనీసం 57 సంవత్సరాలు నిండి ఉండాలి.ఆధార్ కార్డ్

ఓటర్ ఐడి కార్డ్

ఆదాయ ధ్రువీకరణ పత్రం

రేషన్ కార్డ్.బ్యాంకు పాస్ బుక్.

2.దివాంగుల పెన్షన్....

వయోపరిమితి లేదు కనీసం 40 శాతం పైగా వైకల్యంఉండాలి సదరం సర్టిఫికెట్ యు .డి. ఐ.డి.కార్డు.ఆధార్ కార్డుఓటర్ ఐడి కార్డురేషన్ కార్డు.ఆదాయ ధ్రువీకరణ పత్రం బ్యాంకు పాస్ బుక్

వితంతు పెన్షన్ వయసు..

కనీసం 18 సంవత్సరాలు నిండి ఉండాలి.ఆధార్ కార్డ్

ఓటర్ ఐడి కార్డ్ రేషన్ కార్డ్

భర్త మరణ ధ్రువీకరణ పత్రం బ్యాంకు పాస్ బుక్.

చేనేతడ కల్లు గీత కార్మికుల పెన్షన్..

కనీసం 50 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉండాలి.

ఆధార్ కార్డ్ ఓటర్ ఐడి కార్డ్ రేషన్ కార్డ్ సంబంధిత సొసైటీ గుర్తింపు కార్డ్


బ్యాంకు పాస్ బుక్

బీడీ కార్మికులు...

వయసు 50 సంవత్సరాల లోపు ఆధార్ కార్డ్

ఓటర్ ఐడి కార్డ్ రేషన్ కార్డు కార్మిక గుర్తింపు పత్రం

బ్యాంకు.పాసుబుక్.అందుబాటులోఉండే.సంబంధిత మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చు.



# తెలంగాణ ఉద్యమకారుల సదస్సుకు భారీగా తరలిరావాలి

**-మండ్ల దేవన్న నాయుడు**

**– హైదరాబాద్‌లో 31న కేకే కమిటీ సభ్యులతో సమావేశం**



**వనపర్తి, మే 30 (ప్రజాజ్యోతి):** హైదరాబాద్‌లో ఈ నెల 31న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సదస్సు, కేకే కమిటీ సభ్యులతో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి మండ్ల దేవన్న నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో కేకే కమిటీ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీతో చర్చలు జరగనున్నాయని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిందని, వారి సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు గుర్తింపు కార్డులు, 250 గజాల ఇంటి స్థలాలు అందిస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి ఉద్యమకారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. వనపర్తి జిల్లా ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# మహిళా సాధికారతతో వివక్ష లేని సమాజ నిర్మాణం

**గద్వాల మే 30**

ప్రస్తుతం మహిళలు అనేక రంగాల్లో రాణిస్తున్నారని, మహిళా సాధికారతతో వివక్ష లేని సమాజ నిర్మాణం జరుగుతుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న మహిళా సంక్షేమ వారోత్సవాల్లో శనివారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని స్నేహ సంఘాల సభ్యులతో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యూనిసెఫ్ సహకారంతో బాలికల సర్వతోముఖాభివృద్ధికి జిల్లాలోని అన్ని గ్రామాల్లో స్నేహ సంఘాలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. బాలికలు ప్రజాస్వామ్య వ్యవస్థ, నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యల ప్రతిపాదన, ప్రశ్నించడం, తదితర విషయాలపై అవగాహన పెంపొందించుకునేందుకు మాక్ పార్లమెంట్ దోహదపడుతుందన్నారు. స్నేహ సంఘాల ద్వారా అమ్మాయిలు తమ గ్రామాల్లోని బాల్య వివాహాలు, నిరక్షరాస్యత వంటి సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా బాలికలు మాక్ పార్లమెంట్ ద్వారా జిల్లాలోని వివిధ సామాజిక సమస్యలను ప్రస్తావించారు. పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోవడం, ఉన్నచోట పరిశుభ్రంగా లేకపోవడం, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల ఆవశ్యకత, రవాణా సౌకర్యాల కొరత, తదితర సమస్యలను బాలికలు తెలియజేయగా సంబంధిత అధికారులు వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం బాలికలు ఐడిఓసిలో ఉన్న పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలను సందర్శించి అక్కడి పనితీరును గురించి సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ రాష్ట్ర సమన్వయకర్త మురళి, డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఏపీడి శ్రీనివాస్, డిడబ్ల్యూఓ సునంద, డిఇఓ విజయలక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

